

లేచిపడ్డాయి..

మార్కెట్‌కు 'హెవీ' దెబ్బ.. లాభాల స్వీకరణలో ఇన్వెస్టర్లు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఎస్బీఐ షేర్లు భారీగా పతనం

సెన్సెక్స్ 1,053 పాయింట్లు డౌన్.. 71వేల దిగువకు సూచీ

330 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ.. తరలిపోతున్న ఎఫ్ఐఐ పెట్టుబడులు

ఒక్కరోజే రూ.8.5 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి



ముంబై, జనవరి 23: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. వరుసగా ట్రేడింగ్ రెండోరోజూ మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేశారు. ఈ క్రమంలోనే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) వంటి హెవీ వెయిట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఫలితంగానే సూచీలకు పెద్ద ఎత్తున నష్టాలు తప్పలేదు. నిజానికి ఉదయం మార్కెట్లు భారీ లాభాల్లోనే మొదలయ్యాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 561.13 పాయింట్లు లేదా 0.79 శాతం ఎగబాకగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 160.45 పాయింట్లు లేదా 0.74 శాతం ఎగిసింది. అయితే సమయం గడస్తున్నకొద్దీ ఇన్వెస్టర్లు కొనుగోళ్ల నుంచి అమ్మకాల వైపు మళ్లారు. ఈ పరిణామమే చివరకు పెను నష్టాలకు దారితీసింది. సూచీలు 1.50 శాతం క్షీణతను మూటగట్టుకోవాల్సి వచ్చింది. సెన్సెక్స్ 1,053.10 పాయింట్లు లేదా 1.47 శాతం దిగజారి 71వేల స్థాయికి దిగువన 70,370.55 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 70,234.55 స్థాయికి పడిపోయింది. అలాగే అంతకుముందు 72,039.20 పాయింట్లను తాకగా, తీవ్ర ఒడిదొడుకులకు నిదర్శనంగా ఈ ట్రేడింగ్ తీరు నిలిచింది. ఇక నిఫ్టీ సైతం 330.15 పాయింట్లు లేదా 1.53 శాతం కోల్పోయి 21,241.65 వద్ద స్థిరపడింది.

చుట్టుముట్టిన భయాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను ఆయా సంస్థలు ప్రకటిస్తున్న ఆర్థిక ఫలితాలు మదుపరులను పెద్దగా ఆకట్టుకోవడం లేదు. కార్పొరేట్ల పెర్ఫార్మెన్స్‌పై నెలకొన్న ఆందోళనలు.. చాలా రంగాల్లోని కీలక షేర్లను అమ్మకాల ఒత్తిడిలోకి నెడుతున్నాయని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారిప్పుడు. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) కూడా ఈ కారణంతోనే పెట్టుబడుల ఉపసంహరణ దిశగా నడుస్తున్నట్టు వారు చెప్తున్నారు. కాగా, మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. విదేశీ మదుపరులకు సంబంధించి ఓనర్‌షిప్ నిబంధనల్ని కఠినతరం చేస్తుందన్న అంచనాలు సైతం కొనుగోళ్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయంటున్నారు. విదేశీ బ్యాంకులు, ఓ వర్గం ఆఫ్‌షోర్ ఫండ్ మేనేజర్ల ఒత్తిడిని లెక్కచేయకుండా ఫిబ్రవరి 1 నుంచి కొత్త రూల్స్‌ను సెబీ అమల్లోకి తేనుందన్న ప్రచారం కూడా నష్టాలకు దారితీసినట్టు వినిపిస్తున్నాయి. వీటికి ఇండెక్స్‌ల టెక్నికల్ టెన్షన్లు, మిడిల్ ఈస్ట్, ఎర్ర సముద్రం ఉద్రిక్తతలు తోడయ్యాయన్న అభిప్రాయాన్ని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకింగ్ షేర్లు ఫట్

బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్ విలువ గరిష్ఠంగా 6.13 శాతం దిగజారింది. ఎస్బీఐ 3.99 శాతం, యాక్సిస్ బ్యాంక్ 3.41 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.23 శాతం చొప్పున క్షీణించాయి. హిందుస్థాన్ యునిలివర్ షేర్ వాల్యూ సైతం 3.82 శాతం పడిపోయింది. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్ 2.95 శాతం, స్మాల్‌క్యాప్ 2.79 శాతం చొప్పున పతనమయ్యాయి. రంగాలవారీగా రియల్టీ, మెటల్, చమురు-గ్యాస్, ఎనర్జీ, కమోడిటీస్, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్ సూచీలు దిగజారాయి. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, చైనా లాభాల్లో ముగియగా, జపాన్ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లలో జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ సూచీలూ నష్టాల్లోనే కదలాడుతున్నాయి. సోమవారం అమెరికా మార్కెట్లు మాత్రం లాభాల్లో ముగిశాయి.

కుప్పకూలిన జీ

జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీల్) షేర్లు మంగళవారం ట్రేడింగ్‌లో ఏకంగా 33 శాతం వరకు నష్టపోయాయి. జీతో 10 బిలియన్ డాలర్ల విలీన ప్రతిపాదనను జపాన్ దిగ్గజం సోనీ విరమించుకోవడమే ఇందుకు కారణమన్నట్టు ట్రేడర్లు అభిప్రాయపడుతున్నారు. కాగా, బీఎస్ఈలో 32.73 శాతం నష్టంతో రూ.155.90 వద్ద, ఎన్ఎస్ఈలో 30.47 శాతం పతనంతో రూ.160.90 వద్ద జీ షేర్ విలువ ఉన్నది. ఒకానొక దశలోనైతే 52 వారాల కనిష్ఠాన్ని తాకింది. మరోవైపు ఈ దెబ్బతో జీ మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.7,285.53 కోట్లు హరించుకుపోయింది. ప్రస్తుతం బీఎస్ఈలో సంస్థ మార్కెట్ క్యాప్ రూ.14,974.50 కోట్లుగా ఉన్నది.

కరిగిపోయిన లక్షల కోట్లు

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో మదుపరుల సంపద కూడా అంతే స్థాయిలో కరిగిపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన సంస్థల మార్కెట్ విలువ మంగళవారం ఒక్కరోజే రూ.8.50 లక్షల కోట్లు పతనమైంది. రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, హెచ్‌యూఎల్ వంటి అగ్రశ్రేణి సంస్థల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో నష్టాల తీవ్రత అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,65,97,915.97 కోట్ల వద్ద ఉన్నది. శనివారం మార్కెట్ ముగిసే సమయానికి ఇది రూ.3,74,48,736.78 కోట్లుగా ఉన్నది. శనివారం కూడా సెన్సెక్స్ 260 పాయింట్లు క్షీణించిన విషయం తెలిసిందే. నిఫ్టీ 51 పాయింట్లు కోల్పోయింది.

నష్టాలకు కారణాలు

- హెవీ వెయిట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- ఎఫ్ఐఐలు వెనక్కి
- లాభాల స్వీకరణలో మదుపరులు
- సెబీ నిబంధనల కఠినతరంపై ఊహాగానాలు
- మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు

కస్టమర్‌కు గెలాక్సీ ఎస్24 సిరీస్ మొబైల్‌ను అందజేస్తున్న మాస్టర్ టెలికమ్యూనికేషన్స్ యజమాని సమీర్ మహ్మద్. చిత్రంలో సామ్‌సంగ్ ప్రతినిధులు

గెలాక్సీ ఎస్24 సిరీస్ ఫోన్లు

గరిష్ఠ ధర రూ.1,29,999

హైదరాబాద్, జనవరి 23: ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్..తాజాగా గెలాక్సీ ఎస్24 సిరీస్ ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేసింది. హైదరాబాద్‌లోని మాస్టర్ టెలికమ్యూనికేషన్స్ స్టోర్‌లో ఈ ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. మాస్టర్ టెలీకమ్యూనికేషన్ యజమాని సమీర్ మహ్మద్ మాట్లాడుతూ..ఈ నెల 17న అంతర్జాతీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఈ తాజా స్మార్ట్‌ఫోన్లను కేవలం వారంలోనే రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసినట్లు, నూతన టెక్నాలజీ, ఫీచర్స్‌ను కోరుకుంటున్న వారికి ఇది నచ్చుతుందని తెలిపారు.

గెలాక్సీ ఎస్24లో ఫీచర్లు

- 200 మెగాపిక్సెల్ వైడ్ కెమెరా, 12 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ లెన్స్, 50 మెగాపిక్సెల్ టెలిఫోటో షూటర్, 10 మెగాపిక్సెల్ టెలిఫోటో షూటర్, సెల్ఫీ కోసం 12 మెగాపిక్సెల్ కెమెరాను ముందుభాగంలో ఏర్పాటు చేసింది.
- ఆండ్రాయిడ్ 14-బేస్డ్ వన్ యూఐ 6.1, 8జీబీ ర్యామ్, 12జీబీ ర్యామ్, స్టోరేజ్‌ను 1 టీబీ వరకు పెంచుకోవచ్చును.
- 4000 ఎంఏహెచ్, 4,900 ఎంఏహెచ్ బ్యాటరీ కలిగిన ఫోన్ వైర్, వైర్‌లెస్‌తో కూడా చార్జింగ్ చేసుకోవచ్చును.

గెలాక్సీ ఎస్24 సిరీస్ ఫోన్ల ధరలు..

- ఎస్24 ప్రారంభ ధర రూ.79,999
- గెలాక్సీ ఎస్24 ప్లస్ మొబైల్ ధర రూ.99,999
- గెలాక్సీ ఎస్24 అల్ట్రా ప్రారంభ ధర రూ.1,29,999

హైదరాబాద్‌లో ఏసీఈ ఫోరెన్సిక్ సెంటర్

జూమ్ టెక్నాలజీతో కలిసి ఏర్పాటుకు ముందుకొచ్చిన రష్యా సంస్థ

హైదరాబాద్, జనవరి 23(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో అంతర్జాతీయ సంస్థ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. రష్యాకు చెందిన డిజిటల్ ఫోరెన్సిక్, డాటా రికవరీలో దిగ్గజ సంస్థయైన ఏసీఈ ల్యాబ్..జూమ్ టెక్నాలజీస్‌తో కలిసి హైదరాబాద్‌లో ఫోరెన్సిక్ సెంటర్, తయారీ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నది. ఇందుకు సంబంధించి మంగళవారం సచివాలయంలో ఏసీఈ ల్యాబ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) మ్యాక్స్ పుతివ్ సేవ్, జూమ్ టెక్నాలజీస్ సీవోవోతోపాటు ఆయా సంస్థల ప్రతినిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాము ఏర్పాటుచేయబోతున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రతిపాదనలపై మంత్రికి వివరించారు. సైబర్ సెక్యూరిటీకి సంబంధించి 129 దేశాలకు చెందిన ఆయా దర్యాప్తు సంస్థలతో కలిసి పనిచేసిన అనుభవం తమకు ఉందని, డాటా లాస్, డిజిటల్ ఇన్వెస్టిగేషన్ సవాళ్లను అధిగమించడానికి భారతీయ వ్యాపారాలు, బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, దర్యాప్తు సంస్థలకు తాము సహకరిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ఫోరెన్సిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన ఏసీఈ సంస్థను మంత్రి అభినందించారు. మరోవైపు, మంత్రి శ్రీధర్ బాబుతో టిబిటన్ పార్లమెంట్ ఇన్ ఎక్సైల్ ప్రతినిధులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌కర్ నుంచి ప్రతిష్ఠాత్మక స్కోప్ ఎమినెన్స్ అవార్డును అందుకుంటున్న ఎన్ఎండీసీ ఈడీ జయప్రాల్ రెడ్డి

యాక్సిస్ బ్యాంక్ లాభం 6,071 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 23: యాక్సిస్ బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.6,071 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.5,853 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం 4 శాతం పెరిగినట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.26,798 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.33,516 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. వీటిలో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.27,961 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.38 శాతం నుంచి 1.58 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 0.47 శాతం నుంచి 0.36 శాతానికి దిగొచ్చాయి. గత త్రైమాసికంలో బ్యాంక్ రూ.181.70 కోట్ల నిధులను మొండి బకాయిలను పూడ్చుకోవడానికి కేటాయించినట్లు తెలిపింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.12,532 కోట్లకు చేరుకోగా, ఎన్ఐఎం 4.01 శాతంగా ఉన్నది.

లక్ష కోట్లకు ఏయూఎం

ఎల్ఐసీ ఎంఎఫ్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్‌కే ఝా

హైదరాబాద్, జనవరి 23: ఎల్ఐసీకి చెందిన ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ సంస్థ హైదరాబాద్‌లో ఆధునీకరించిన నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించబోతున్నది. ఈ సందర్భంగా ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్‌కే ఝా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో ఫండ్లలో పెట్టుబడిపెట్టేవారి సంఖ్య గణనీయంగా పెరిగారని, ఒక హైదరాబాద్‌లోనే లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. గతేడాది చివరినాటికి మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ రూ.50.77 లక్షల కోట్లకు చేరుకోగా..దీంట్లో తెలంగాణ-ఏపీ వాటా రూ.1.43 లక్షల కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం రూ.27 వేల కోట్లుగా ఉన్న కంపెనీ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్(ఏయూఎం) విలువ వచ్చే రెండేండ్లలో లక్ష కోట్లకు చేరుకుంటుందన్నారు.

దిగుమతి సుంకం పెంపు

పసిడి, వెండి నాణేలు, హుక్స్‌పై 11 శాతం నుంచి 15 శాతానికి

న్యూఢిల్లీ, జనవరి 23: బంగారం, వెండి ఫైండింగ్స్, నాణేలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచింది. ఆభరణాల తయారీలో ఉపయోగించే హుక్స్, పిన్స్,క్లాంప్ తదితరాల్ని ఫైండింగ్స్‌గా వ్యవహరిస్తారు. ఇప్పటివరకూ బంగారం, వెండి బార్స్‌పై దిగుమతి సుంకం 15 శాతం ఉండగా, ఫైండింగ్స్, నాణేలపై 11 శాతమే కొనసాగుతున్నది. ఇక నుంచి బార్స్‌కు సమానంగా వీటికి కూడా సుంకం వర్తించేలా 11 శాతం నుంచి 15 శాతానికి పెంచినట్టు (సెస్‌తో కలిపి) ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు తెలిపారు. రెండు నెలలుగా ఫైండింగ్స్, నాణేల దిగుమతులు పెరుగుతున్న నేపథ్యంలో వీటిని బార్స్‌గా మార్చిడి చేయడాన్ని నిరోధించడానికి ఈ చర్య తీసుకున్నట్టు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. పెంపుదల జనవరి 22 నుంచి అమలులోకి వచ్చింది. అలాగే విలువైన లోహాల పొడి దిగుమతులపై 4.35 శాతం సెస్ విధిస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్ (సీబీఐసీ) సోమవారం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై ప్రస్తుతం ఉన్న 10 శాతం బేసిక్ దిగుమతి సుంకానికి అదనంగా సెస్‌ను విధించారు.

తగ్గిన రూపాయి విలువ

ముంబై, జనవరి 23: గతవారం కాస్త బలపడిన రూపాయి మారకపు విలువ ఈ వారం ప్రారంభ ట్రేడింగ్ రోజైన మంగళవారం మళ్లీ దిగువబాట పట్టింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్)లో 83.06-83.17 మధ్య హెచ్చుతగ్గులకు లోనైన రూపాయి చివరకు క్రితం ట్రేడింగ్ రోజుతో పోలిస్తే 8 పైసలు నష్టపోయి 83.15 వద్ద ముగిసింది. శుక్రవారం ఇది 83.07 వద్ద ముగియగా, సోమవారం కరెన్సీ మార్కెట్‌కు సెలవు. దేశీయ స్టాక్ మార్కెట్‌లో నెగిటివ్ ట్రెండ్ నెలకొనడం, ముడి చమురు ధర పెరగడం రూపాయి తగ్గుదలకు కారణమని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. డాలర్ ఇండెక్స్ 103.22 వద్దకు చేరగా, ప్రపంచ మార్కెట్లో బ్యారల్ క్రూడాయిల్ ధర 79 డాలర్ల స్థాయిని దాటింది. బీఎస్ఈ సెన్సెక్స్ అనూహ్యంగా 1,000 పాయింట్లకుపైగా నష్టపోయింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) వరుస విక్రయాలు సైతం రూపాయిని బలహీనపర్చిందని ట్రేడర్లు చెప్పారు. మంగళవారం స్టాక్ మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు రూ.3,115 కోట్లు వెనక్కు తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల ప్రాథమిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

GRANULES

గ్రాన్యూల్స్ ఫర్వాలేదు

హైదరాబాద్, జనవరి 23: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.125.7 కోట్ల పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభాన్ని గడించింది గ్రాన్యూల్స్ ఇండియా. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.124.3 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం ఒక్క శాతం మాత్రమే వృద్ధిని కనబరిచింది. ఆదాయం రూ.1,146 కోట్ల నుంచి రూ.1,155 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ..గత త్రైమాసికంలో నిలకడైన వృద్ధిని సాధించినట్టు, అమెరికాలో ఫార్ములేషన్ వ్యాపారం భారీ వృద్ధిని నమోదు చేసుకున్నదన్నారు.

రెనో నుంచి ఈవీ మాడల్!

సరికొత్త ట్రైబర్ కారుతో రెనో ఇండియా ఎండీ, సీఈవో వెంకట్రామ్ మామిళ్లపల్లి, కంపెనీ సేల్స్ హెడ్ శామ్‌సుదిన్ సాహల్

300 కిలోమీటర్ల స్థాయిలో విడుదల చేయనున్న సంస్థ

హైదరాబాద్, జనవరి 23: ఫ్రెంచ్‌నకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన రెనో..దేశీయ మార్కెట్లో మరింత పట్టు సాధించడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఇప్పటికే మూడు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్న సంస్థ..వచ్చే మూడేండ్లకాలంలో ఐదు సరికొత్త మాడళ్లను పరిచయం చేయనున్నట్లు ప్రకటించింది. వీటిలో ఒక్క ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీలు, సీఎన్‌జీలు ఉన్నాయని రెనో ఇండియా ఎండీ, సీఈవో వెంకట్రామ్ మామిళ్లపల్లి తెలిపారు. సింగిల్ చార్జింగ్‌తో 300 కిలోమీటర్ల స్థాయిలో ప్రయాణించే ఈవీ మాడల్ ఎప్పటిలోగా విడుదల చేసేదానిపై ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. దీని ధర రూ.12 లక్షలకు పైగా ఉంటుందని సూచనప్రాయంగా వెల్లడించారు. దేశవ్యాప్తంగా బ్యాటరీ చార్జింగ్ సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదన్నారు.

ఈ ఏడాది 20 శాతం వృద్ధి

ప్రస్తుత సంవత్సరంలో 20 శాతం వృద్ధి అంచనావేస్తున్నట్లు చెప్పారు. 2023లో దేశీయంగా 49 వేల వాహనాలను విక్రయించినట్లు, ఈ ఏడాది ఈ సంఖ్య 20 శాతం వృద్ధితో 60 వేలకు చేరుకునే అవకాశం ఉన్నదన్నారు. వీటిలో క్విడ్, కైగర్, ట్రైబర్ అత్యున్నత ఫీచర్స్‌తో రూపొందించినట్లు, ముఖ్యంగా భద్రతకు పెద్దపీట వేసినప్పటికీ ఎలాంటి అదనపు చార్జీలు విధించడం లేదని చెప్పారు. ప్రస్తుతం సంస్థ 1.8 శాతం మార్కెట్ వాటా కలిగివున్నది. మరోవైపు, దేశవ్యాప్తంగా చిన్న స్థాయి కార్లకు డిమాండ్ అంతకంతకు పడిపోతున్నదని, ఈ సమయంలోనే రూ.10 లక్షల కంటే అధిక ధర కలిగిన మధ్యస్థాయి ఎస్‌యూవీలకు డిమాండ్ అధికంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం సంస్థకు దేశవ్యాప్తంగా 430 అవుట్‌లెట్లు ఉండగా, వీటిలో తెలంగాణలో 20 అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది.

మూడు ఈవీలను తీసుకొస్తాం

హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా

ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్..ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)పై ప్రత్యేక దృష్టి సారించింది. వచ్చే ఏడాదిలో దేశీయ మార్కెట్లోకి మూడు సరికొత్త ఎలక్ట్రిక్ ద్వి చక్ర వాహనాలను విడుదల చేయనున్నట్లు కంపెనీ సీఈవో నిరంజన్ గుప్తా తెలిపారు. దేశీయ మార్కెట్లోకి మార్విక్ 440 బైకును విడుదల చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కంపెనీ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్లాంట్ సామర్థ్యాన్ని నెలకు 10 వేల యూనిట్లకు పెంచుకుంటున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మధ్యస్థాయి ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు, అమెరికాకు చెందిన జీరో మోటర్‌సైకిల్‌తో కలిసి బైకు విడుదల మరింత ఆలస్యంకావచ్చునని, దేశీయంగా ప్రీమియం బైకులకు ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతున్నదని వ్యాఖ్యానించారు.

మరో 100 నగరాలకు విడా స్కూటర్లు..

ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విడా స్కూటర్లను మరో 100 నగరాలకు విస్తరించనున్నట్లు ఆయన ప్రకటించారు. గడిచిన వారంలో మొత్తంగా 100 నగరాల్లో ఈ స్కూటర్లు లభిస్తున్నాయని, వచ్చే ఏడాది చివరినాటికి వీటిని మరో వంద నగరాల్లో విక్రయించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎక్స్‌క్లూజివ్ చిన్న స్టోర్లను సైతం ఏర్పాటు చేసే అవకాశాలను సైతం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్షీణించిన ఎఫ్‌డీఐలు

13.54 బిలియన్ డాలర్లకు తగ్గుదల • రిజర్వ్ బ్యాంక్ బులెటిన్

ముంబై, జనవరి 23: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) గణనీయంగా తగ్గాయి. 2022 ఏప్రిల్-నవంబర్‌లో ఇవి 19.76 బిలియన్ డాలర్లుకాగా, 2023లో 13.54 డాలర్లకు క్షీణించినట్టు రిజర్వ్‌బ్యాంక్ తాజా బులెటిన్ వెల్లడించింది. 2023 ఏప్రిల్-నవంబర్ నెలల్లో దేశంలోకి స్థూలంగా 21.39 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు తరలిరాగా, దేశం నుంచి 7.85 బిలియన్ డాలర్లు తరలివెళ్లాయి. దీంతో నికరంగా 13.54 బిలియన్ డాలర్లు వచ్చినట్లయ్యింది. ఎఫ్‌డీఐ వివరాలు..

- తయారీ, విద్యుత్, ఇతర ఇంధన రంగాలు, రవాణా, ఫైనాన్షియల్ సర్వీసులు, రిటైల్, హోల్‌సేల్ ట్రేడ్ రంగాల్లోకి మూడింట రెండువంతుల ఎఫ్‌డీఐ ఈక్విటీ రూపంలో వచ్చింది.
- దేశం ఆకర్షించిన ఈక్విటీ నిధుల్లో అత్యధికంగా 69.9 శాతం మారిషస్, సింగపూర్, జపాన్, యూఎస్, నెదర్లాండ్స్ దేశాల నుంచి వచ్చాయి.
- ఎఫ్‌డీఐని అధికంగా ఆకర్షించిన టాప్-10 దేశాల్లో ఇండియా ఉన్నదని ఆర్బీఐ బులెటిన్ తెలిపింది. 2023-24 ద్వితీయార్థంలో ఎఫ్‌డీఐ ప్రవాహం పెరుగుతుందని అంచనా వేసింది.

ప్యాసింజర్ వెహికిల్స్‌కు గిరాకీ

ఈ ఆర్థిక సంవత్సరం 20 శాతం వృద్ధికి అవకాశం: కేర్‌ఎడ్జ్

ముంబై, జనవరి 23: ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ప్యాసింజర్ వెహికిల్స్ (పీవీ) విభాగంలో 18-20 శాతం వృద్ధికి వీలుందని మంగళవారం క్రెడిట్ రేటింగ్స్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ తమ నివేదికలో అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ ఈ వృద్ధి కొనసాగవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మార్కెట్‌లో పెద్ద ఎత్తున డిమాండ్ ఉండటం, ఇప్పటికే ఆర్డర్లు భారీగా వచ్చిన నేపథ్యంలో ఈ రిపోర్టు విడుదలైంది. కాగా, ప్రీమియం వేరియంట్లకు డిమాండ్ ఉంటుందని, అయితే ఎంట్రీ లెవల్ వేరియంట్లకు అంతగా ఆదరణ ఉండకపోవచ్చని కేర్‌ఎడ్జ్ మార్కెట్ ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నది. ఇక ఎలక్ట్రిక్ ఫోర్‌వీలర్ సెగ్మెంట్‌లో గత కొన్నేండ్లుగా అమ్మకాలు పెరుగుతూ వస్తున్నాయని పేర్కొన్నది. మొత్తం ఈవీ మార్కెట్ సేల్స్‌లో దాదాపు 6 శాతం వాటా వీటిదేనని చెప్పింది. ఈ క్రమంలోనే ప్రధాన ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఓఈఎం) మున్ముందు మరిన్ని ఈవీలను మార్కెట్‌కు పరిచయం చేయడంపై దృష్టి పెడుతున్నట్టు కేర్‌ఎడ్జ్ రిసెర్చ్ డైరెక్టర్ తన్వీ షా తెలిపారు. భారతీయ వాహన విక్రయాల్లో పీవీ సేల్స్ వాటా 18 శాతంగా ఉన్నది. ఈ క్రమంలో గతంతో పోల్చితే నిరుడు ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య 25 శాతానికి పెరిగిందన్నారు. మరోవైపు డిమాండ్‌కు తగ్గట్టుగా వాటి ధరల్నీ ఆయా సంస్థలు పెంచుతూపోతున్నాయి.